క్లుప్తంగా

మున్నిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


దీపదాస్‌మున్నితో కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్నిని సోమవారం ఆమనగల్లు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మున్నిని ఆమనగల్లు పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఫరీద్, నాయకులు మహేశ్ సత్కరించారు.

భక్తే మోక్ష మార్గం

సర్పంచ్ ఈశ్వర్‌నాయక్


భూమిపూజ చేస్తున్న సర్పంచ్, తదితరులు

తలకొండపల్లి: భక్తే మోక్ష మార్గమని సర్పంచ్ ఈశ్వర్‌నాయక్ అన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని కోరారు. మండల పరిధిలోని గడ్డమీది తండా గ్రామ పంచాయతీలోని ఆర్లకుంటతండాలో హనుమాన్ ఆలయ నిర్మాణ పనులను ఈశ్వర్‌నాయక్, తండావాసులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. శిథిలమైన ఆలయ మరమ్మతులతో పాటు, నూతన ఆలయాల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దశరథ్ నాయక్, బీంలాల్, జంప్లానాయక్, కృష్ణానాయక్, కోటినాయక్, రాములునాయక్, బీమ్లా, హేంలాల్, చక్రి, గోపాల్, రవీందర్, హనుమంతు పాల్గొన్నారు.

విద్యార్థి 'టాలెంట్'


విద్యాసాగర్‌కు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ఇబ్రహీంపట్నం రూరల్: మండల పరిధిలోని బొంగ్లూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థి సత్తా చాటాడు. సోమవారం హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో మ్యాథమాటిక్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో బొంగ్లూర్ ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యాసాగర్ అనే విద్యార్థి 50 మార్కులకు గాను 48 మార్కులు సాధించి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచాడు. అనంతరం నిర్వాహకులు బహుమతి అందజేశారు. పాఠశాల ప్రిన్స్‌పాల్ లావణ్య, ఉపాధ్యాయులు విద్యార్థిని ఘనంగా సత్కరించారు.

సీఐ ఆంజనేయులుకు సత్కారం


సీఐకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కిషోర్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయులును సోమవారం నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు నంద కిషోర్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు విద్యార్థులు, యువత, రాజకీయపక్షాల నేతలు, ప్రజలందరూ సహకరించాలని ఈ సందర్భంగా సీఐ కోరారు.

అంజయ్యకు అవార్డు అందజేత

కందుకూరు: కందుకూరు లయన్స్ క్లబ్ చార్టర్ కార్యదర్శి తాళ్ల అంజయ్య లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఎక్స్‌టెన్షన్ అవార్డును అందుకున్నారు. ఆదివారం రాత్రి సికింద్రాబాద్ లయన్స్‌క్లబ్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎల్‌సీఐఎఫ్ ఏరియా లీడర్ ఎస్.నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 17 సంవత్సరాలుగా లయన్స్‌క్లబ్‌లో అనేక సేవలు అందిస్తూ కొత్తగా రెండు క్లబ్‌లను ఏర్పాటు చేసినందుకు అవార్డు అందించామన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ హరినారాయణ్, వైస్ గవర్నర్లు డి.కోటేశ్వరరావు, డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి, మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, కార్యదర్శి జనార్దన్ పాల్గొన్నారు.

ఊరూవాడా.. రామనామ స్మరణ

అయోధ్యలో భవ్య రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో అన్ని గ్రామాలు రామనామ జపంతో పులకించాయి. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, హోమాలు, యజ్ఞాలు నిర్వహించారు. ఆలయాల వద్ద బిగ్ స్క్రీన్లను ఏర్పాటు చేసి అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవాన్ని భక్తులు తిలకిస్తూ ఉద్వేగానికి గురయ్యారు. జై శ్రీరామ్.. జై శ్రీరామ్ అంటూ నినదించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం శ్రీరాముని శోభాయాత్ర నిర్వహించారు.


ఇబ్రహీంపట్నం: కర సేవకులకు సన్మానం


యాచారం: మాల్‌లో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ వేషధారణలో చిన్నారులు


ఆమనగల్లు: వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన యజ్ఞంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్


మాడ్గుల: హనుమాన్ ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు


తుర్కయంజాల్: సీతారామాంజనేయ ఆలయంలో కోలాహలం


శ్రీరాముని పల్లకీసేవలో భక్తులు


అబ్దుల్లాపూర్‌మెట్: రామాలయంలో కొలువుతీరిన సీతారాములు


దండుమైలారంలో సీతారాముల కల్యాణోత్సవం


మంచాల: కర సేవకులను సన్మానిస్తున్న నాయకులు


శ్రీరాముని శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

మల్లు రవికి సత్కారం


మల్లు రవిని సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: మాజీ ఎంపీ మల్లు రవిని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమించడంపై కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లో మల్లురవి నివాసంలో సోమవారం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సత్కరించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని మల్లురవిని కోరారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తేవాలని కోరారు.

మల్లురవి నియామకంపై హర్షం

తలకొండపల్లి: మల్లురవి నియామకంపై జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రవి ప్రతిభను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానంతో గౌరవించిందన్నారు. ఆయన హయాంలో రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కారమయ్యే అవకాశముందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో వైద్యుడు చంద్రశేఖర్ 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 25 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ యాదయ్య, సంయుక్త కార్యదర్శి బాలకృష్ణ, పీఆర్‌ఓ పాషా, సభ్యులు చంద్రశేఖర్, వెంకటయ్య, కొండల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు చంద్రశేఖర్

ప్రభుత్వ కళాశాలలో చేరండి

మంచాల: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తామని మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య అన్నారు. సోమవారం మంచాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ ప్రైవేట్ కళాశాలలకు దీటు ప్రభుత్వం జూనియర్ కళాశాలలో విద్య బోధన అందించడం జరుగుతుందన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మంచాల ప్రభుత్వం జూనియర్ కళాశాలలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆనంద్, సంపత్‌కుమార్, వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ తిరుపతయ్య

భక్తిభావంతో మెలగాలి

ఆమనగల్లు: ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలిగినప్పుడే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని మేడిగడ్డ తాండ సర్పంచ్ అంబర్‌సింగ్, రవీందర్‌నాయక్ అన్నారు. దైవ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డతాండలో భక్తుల విరాళాలతో రూ.30 లక్షలతో నిర్మించే శివాలయ నిర్మాణానికి సోమవారం తాండ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ఆలయం నిర్మాణానికి తాండ వాసులు ముందుకురావడం అభినందనీయమని కొనియాడారు. భక్తులు, దాతల సహకారంతో శివాలయాన్ని నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాములు, మాజీ ఎంపీటీసీ పరమేశ్, ఉపసర్పంచ్ మల్లేశ్, స్థానిక నాయకులు శంకర్‌నాయక్, కృష్ణనాయక్, పాండునాయక్ పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న రవీందర్‌నాయక్, అంబర్‌సింగ్

పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: గ్రామ పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని ఎంపీపీ కొప్పు సుకన్య ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. గత బీఆర్ఎస్ సర్కార్ గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయలేదని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో పాటు గ్రామాల్లో వసూలు చేసిన పన్నులతో పంచాయతీల నిర్వాహణ జరిగిందని అన్నారు. సర్పంచ్‌లు పలుమార్లు కేసీఆర్ సర్కార్‌ను పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేసిన స్పందించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం హయత్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మమతాబాయి తెలిపారు. ఎంపీపీ బుర్ర రేఖా అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

నేడు 5కే రన్

మాడ్గుల: మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సేవ్ ఎన్విరాన్‌మెంట్, పబ్లిక్ హైస్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం 5కే రన్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులని, విద్యారంగంతో క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

రేపు విద్యుత్ సమస్యలపై గ్రీవెన్స్

హుడాకాంప్లెక్స్: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఉదయం 10.30 గంటలకు మధ్యాహ్నం ఒంటి గంట వరకు హయత్‌నగర్‌లోని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయం (ఆటోనగర్) వద్ద కన్జ్యూమర్ గ్రీవెన్సెస్ సమావేశం నిర్వహించనున్నట్లు డీఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, మెంబర్ టెక్నికల్, మెంబర్ ఫైనాన్స్, కన్జ్యూమర్ అఫైర్లు హాజరవుతారని, వినియోగదారులు దీర్ఘకాలంగా ఉన్న విద్యుత్ సమస్యలు, బిల్లుల్లో హెచ్చుతగ్గులపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందగలరని సూచించారు.

అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా

మహేశ్వరం: మండల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని మండల ఇన్‌చార్జి ఎంపీపీ సునితా నాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునితానాయక్ మాట్లాడుతూ.... మండల అభివృద్ధిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి గ్రామం, తండాల్లో మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. త్వరలో జరిగే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు స్పష్టమైన ఎజెండాతో రావాలని ఆమె సూచించారు. ప్రతి అధికారి బాధ్యతయుతంగా పని చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నర్సింహ, డీఈ జగన్మోహన్‌రెడ్డి, ఎంఈఓ కృష్ణ, సీడీపీఓ షబానా పాల్గొన్నారు.

మహనీయులను అవమానించిన వ్యక్తిని శిక్షించాలి

ఆమనగల్లు: భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్, మహాత్మాగాంధీని తీవ్ర పదజాలంతో దూషించి, అవమానించిన నల్గొండ జిల్లా గట్టుప్పల మండలం తేరెటిపల్లి గ్రామానికి చెందిన పతంగి అజయ్‌పై చర్యలు తీసుకోవాలని మాదిగ సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో అజయ్‌పై చర్యలు తీసుకోవాలని సోమవారం ఫిర్యాదు చేశారు. మహనీయులను అవమానించడంతో పాటు మాదిగ జాతిని ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించడంతో మాదిగ సమాజం తీవ్ర ఆందోళన చెందుతుందని పేర్కొన్నారు. అజయ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘాల ఐక్యవేదిక నాయకులు రమేశ్, జంతుక శంకర్, బాలు, బలరాం, రామకృష్ణ, మహేశ్, శ్రీకాంత్, అయోధ్య, మల్లేశ్, శ్రీశైలం ఉన్నారు.


ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న మాదిగ సంఘాల ఐక్యవేదిక నాయకులు

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని పలు ఫర్టిలైజర్, అధికృత ఎరువుల డీలర్ షాపులను సోమవారం మండల వ్యవసాయాధికారి అరుణకుమారి తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో స్టాక్‌ను పరిశీలించారు. ఎరువుల డీలర్స్ విధిగా ఈ పాస్‌లో ఎరువుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షాపుల యజమానులు సురేశ్, రవి, వెంకటయ్య, రాజేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

ఆమనగల్లు మండల పరిధిలోని మాలెపల్లి గ్రామంలో సోమవారం యాసంగి పంటలను మండల వ్యవసాయాధికారి అరుణకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ యాసంగిలో సాగుచేసిన వేరుశనగ, వరి పంటలలో చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వేరుశనగలో ఆకుమచ్చ తెగులు నివారణకు ఎకరానికి కాపర్ ఆక్సిక్లోరైడ్ 500 గ్రాములు, ఫార్ములా 4 ఎకరాకు 500 గ్రాములు పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, ఏఈఓ శివతేజ, రైతులు కృష్ణయ్య, మహేశ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.


ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న అరుణకుమారి

మెరుగైన పాలనే ప్రభుత్వ లక్ష్యం


అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రంగారెడ్డి

తుర్కయంజాల్: ప్రజలకు మెరుగైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం పురపాలక సంఘం పరిధిలోని తొర్రూర్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధతో కలిసి రూ.2 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సీహెచ్. శ్రీకాంత్, కౌన్సిలర్లు శివలింగం గౌడ్, కొత్తకుర్మ మంగమ్మ, నాయకులు అంజయ్య, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని వాదే ముస్తఫా బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక బీఆర్ఎస్ నాయకులు మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డికి విన్నవించారు. ఈ మేరకు మాజీ ఎంపీటీసీ షేక్ అఫ్జల్, పార్టీ నాయకులు సయ్యద్‌హుస్సేన్, అజ్జులు సోమవారం ఎమ్మెల్యేను ఆమె నివాసంలో కలిసి సమస్యలు వివరించారు. వాదే ముస్తఫా బస్తీలో ఝుంఝుం హోటల్ నుంచి రోడ్డు చివర వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు సంబంధించి గతంలోనే నిధులు మంజూరయినప్పటికీ , ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.